మధురం లేచిపోయిందనే సంగతి మొదట యెవరు చెప్పారో జ్ఞాపకం లేదు. గాలిలో పరుగెత్తు కొచ్చినట్టు వచ్చింది ఖబురు. రమణరావు లేవదీసుకు వెళ్ళాడో వెంకట్రావు లేవదీసుకు వెళ్ళాడో ఖాయంగా తెలియదు. కొంత మంది రమణరావు అనీ, కొంతమంది వెంకట్రావు అనీ కొంతమంది ఇద్దరూ కలసి అనీ.

అప్పటికి రెండు రోజులనుంచీ కాలేజీకి సెలవవటంవల్ల నాకు వార్త వచ్చేటప్పటికి సాయంత్రం 5 గంట

అయింది. అప్పటి కాలేజీలో పిల్ల లందరికీ, వూళ్ళో సగంమందికి ముఖ్య విషయం మటుకు పాకింది. దీంట్లో విశేషం యేమిటంటే మధురం బి. యే. జూనియరు చదవటమూ గాదు, మా కందరికీ కావలసిన క్లాసుమేటు కావటమూ కాదు. ఆమె మా ఇంగ్లీషు ప్రొఫెసరు రామనాధంగారి కుమార్తె కావటం. ఇట్లా జరుగుతుందనే సంగతి ఆయనకే గాదు కాలేజీలో మా కెవరికీ తెలియకుండా మేనేజ్ చేశా రంటే మాకు బహు పెద్ద ఆశ్చర్యంవేశింది.

వాళ్ళ రూముకు వెంటనే పరుగెత్తాను అది రామనాధంగారి యింటి దగ్గిరగా వాళ్ళ బజారులోనే వుంది. గదిలో వెంకట్రావు వున్నాడు. అతని చుట్టూరా అయిదారుగురుమంది మన స్నేహితు లున్నారు. నా వెనకటితేనే ఇంకా చాలామంది రానందుకు ఆశ్చర్యం వేశింది.

వెంకట్రావు పెద్ద హీరోలాగా కూర్చున్నాడు — తానే ఇంతపని చేసినట్టుగా. మొత్తంమీద యేమి చేసినా యేమి చెయ్యకపోయినా కొంత తెలిసి వుండాలి అనుకున్నా మనిషి తరహానుబట్టి, వీడి దగ్గరనుంచి ఎట్లాగైనా ఇన్ఫర్మేషన్ లాగాలె

"ఏమి టిది ?" అన్నా.

"ఏమి టిది యేమిటి ?" అన్నాడు వెంకట్రావు

"మా దగ్గిర బుకాయించకు."

"అమ్మతోడు — యెంత వొట్టుపెడితే అంతవొట్టు. మీ దగ్గిర ధ స్తానా ! మీ కెంత తెలుసునో నా కంత తెలుసు" అన్నాడు. కాని మేం యెవ్వరం నమ్మలేదు. ఒకళ్ళిద్దరం వుంటే యేమన్నా చెప్పేవాడేమో. పది పదిహేను మందిమి వున్నామాయను, కొంచెం సంకోచించినట్టు కనపడ్డాడు. కాని అక్కడ అపాట్ల వొదిలిపెడితే కడుపుబ్బరంపుట్టి చస్తాడేమోనని కనికరించి నేనే ప్రశ్నలు వేసి లాగుదామని చూచాను.

"వాళ్లు లవ్ చేసుకుంటూన్నట్టు నీవు యిదివరకు యేమన్నా అనుమానపడ్డావా ?"

"ఆమె రమణగాడ్ని ప్రేమిస్తున్నట్టు కలలోగూడా అనుమానపడలేదు; కాని రమణగాడూ నేనూ అస్తమానం మధురాన్ని ప్రేమిస్తూండేవాళ్ళం. వాడు నాకు అందకుండా యెగరగొట్టేశాడు."

రమణగాడు చివరమాటు యెక్కడ కనపడ్డాడు ? ఎప్పుడు కనపడ్డాడు ? ఒక్కడే కనపడ్డాడా? వీటికి సమాధానం చెప్పు."

"నా కేమీ తెలియ దంటే నా దగ్గర నుంచి ఇన్ఫర్మేషన్ లాగాలెనని చూస్తూన్నారే మీరు? సరే కానీండి చివరి మాటు రమణగాడిని ఈ రూము దగ్గర రాత్రి షుమారు 2 గంటలకు బండిలో

మధురంతో కూర్చుండగా చూచాము. మీకు సంతృప్తి అయిందా ?''

"వారే! వీడికి అంతా తెలుసురో! మన్ని బుకాయిం చేస్తున్నాడ్రా!'' అన్నాడొకడు.

"మనకు అంతా చెప్పేదాకా వదలి పెట్టొద్దురా!'' అన్నాడు ఇంకోడు.

''వారే, బ్రదర్! లాభంలేదు చెప్పాలిసిందే'* అన్నాను.

అప్పుడు వెంకట్రావు అన్నాడు—"మీ రందరూ నే చెప్పేది పరమ రహస్యంగా అట్టేపెడతా మని చేతిలో చెయి వేస్తే నాకు తెలిసినంత మటుకూ చెపుతాను. రామనాధంగారుగూడా అడుగుతే నా కేమీ తెలియ దని ప్రమాణం చేసి చెప్పాను. యేమిటి. మీరందరూ ప్రామిస్‌చేస్తారా!''

మేము యావన్మందిమీ తప్పకుండా రహస్యంగా అట్టేపెడతా మని తలలు వూపాము. అప్పుడు వెంకట్రావు పూస గుచ్చినట్టు అంతా చెప్పాడు.

* * *

మన రమణగాడి సంగతి మీకు తెలుసుగా—ప్రతి ప్రొఫెసరు ఇంటికి వెళ్ళటం. దణ్ణాలుపెట్టి వస్తూంటం.

ఇట్టా ఉంటే అసలు మూలం యెట్లా వచ్చిందంటే వారం రోజులక్రిందట వీడు వాళ్ళింటి కెళ్ళినప్పుడు మధురం "కీప్స్" యివ్వమని అడిగింది. సరేలే అన్నాడు. అన్నవా డేం చేశాడు, ఆ పుస్తకం సరిగా ఇవ్వక దాంటో ఓ ఉత్తరం పెట్టాడు. అప్పుడు నాతో ఆలోచించకుండా నాకు తెలియకుండా చేశాడు. దాంట్లో యేమని రాశాడు, "Dear M. I love your అని ఒక ముక్కరాసి దాంటో పెట్టాడు ఆ పుస్తకం యిచ్చేశాడు.

అప్పటినుంచీ యేంచేశాడూ, ఆయింటి ముందరగా వెళ్ళదాం రారా అంటే రాడు. అసలు కాలేజీ గూడా రెండు రోజులు యెగ్గొట్టాడు. ఏదో పెద్దభారం తన మీద పడ్డట్టుగా దిగాలపడి కూర్చున్నాడు. ఏమిట్రా అంటే యీ కాస్తముక్కా బయటపెట్టాడు.ఇహ వీడ్ని కాలేజీలోంచి డిస్‌మిస్ చెయ్యటం ఖాయం అనుకున్నా.

కాని అంతమటుకూ యేమీ బయటకు రాలేదు. మధురంమటుకు నన్ను చూస్తే సురసురలాడుతూ మొహం అటు తిప్పుకునేది. అప్పుడు అనుకున్నా యిది వుత్తరం సంగతి యెవరికీ బయట పెట్టలేదని. పైగా రామనాధంగారు నన్ను పిలిచి "రమణరావు రాలేదేం?" అని అడిగాడు. "ఏదో వొంటో కొంచెం సుస్తిగావుండి రాలేదండి" అని తడువుకోకుండా చెప్పాను. ''అలాగా, పాపం! రేపు ఒక్కసారి మాయింటికి రమ్మన్నానని చెప్పు'' అన్నాడు. అక్కడితో నాకు మరికాస్త ధైర్యం వచ్చింది. ఈ సంగతంతా రూముకు వచ్చి రమణగాడితో చెప్పాను.

వాడికీ ధైర్యం వచ్చింది. చావుతప్పి కన్ను లొట్టపోయి బయట పడ్డాడో లేదో అప్పుడే మొదలుపెట్టాడు, మధురానికి తనమీద ప్రేమ వుందనీ, అ సంగతి తనకు మొదటినుండీ తెలుసుననీ. ఈ విధంగా అప్పుడు నేను గదమాయించాను "చాల్లే, వెధవా, నోరు మూసుకొని వుండు. లేకపోతే నేనే వెళ్ళి ఆ రామనాధంగారితోనూ ప్రిన్సిపాల్తోనూ చెప్పి, మధురం చెయ్యటానికి జంకుతూన్న పని నేను చేసేస్తాను." అంత గట్టిగా చెప్పినతర్వాత నోరు మూసుకున్నాడు.

మొన్నాడు పొద్దున్న రామనాధంగారు పిల్చారు. వెళ్ళరా అంటే కదలడే! "నేను వెళ్ళను. ఏదో ప్రయివేటుగా దొబ్బులు పెట్టటానికి రమ్మన్నాడు," అంటాడు. రామనాధంగారి చేతనో లేకపోతే మధురం చేతనో దొబ్బులు పెట్టిస్తేనే బాగుంటుం దని నాకు తోచింది. అందుకని వూరుకోక వాడు వెళ్లేదాకా చంపాను. ఇహ వాడు తప్పనిసరిగా బయలుదేరాడు!

* * *

రమణ వెళ్ళి వరండాలో నిల్చొని "రామనాధంగా రున్నారా?" అని యెవరికన్నా వినపడుతుందేమో అన్నట్టు నెమ్మదిగా అడిగాడు. అదృష్టవశాత్తు మధురం పక్క గదిలోనే వుంది. "లేరు" అని జవాబు చెప్పింది. బతికి బయట పడదామని చూస్తుండగా మధురం యెవరో చూట్టానికి బయటకు వచ్చింది. చూస్తే వీడు; తప్పించుకు పారిపోతున్నాడు. "మిష్టర్, ఇట్రా" అంది మధురం. చేతులూ కాళ్ళూ చల్లబడ్డయి రమణగాడికి. మెల్లిగా గదిలోకి వెళ్ళాడు. పుస్తకమూ వుత్తరమూ తీసి—

"ఏమి టీ వుత్తరం?"

....

"ఇట్లా వుత్తరాలు రాయగూడ దని నీకు తెలియదూ?"

....

"మన ప్రిన్సిపాలు యెంతమందిని డిస్మిస్ చేశాడు?"

....

"ఈ పాట్ల యీవుత్తరం మా నాన్నగారికి చూపిస్తేచాలు, నీవు యేమవుతావో ఆలోచించుకున్నావా?"

....

"నీవు బి, యే. చదువుతున్నావే, యింతమాత్రం జ్ఞానం లేకపోయిందా?"

....

"ఎప్పుడూ యిట్లాంటి పని చేయ నని ప్రామిస్ చేస్తావా?"

....

"లేకపోతే దీన్ని యిప్పుడే మా నాన్నగారి కిచ్చి ప్రిన్సిపాలుగారికి పంపించనా?" అంది మధురం.

ఇంతవరకు రమణగాడు ఒక్కమాట గూడా మాట్లాడలేదు. బెల్లంకొట్టిన

రాయి లాగా వింటూ దూలాలసంక చూస్తూ నిల్చున్నాడు. ఇప్పుడు తప్పని సరిగా మధురాన్ని క్షమాపణ కోరి తన ప్రాణం కాపాడుకోవలసి వచ్చింది. "తెలియక చేశాను, నన్ను నీవు యేం చేసినా సరే" అన్నాడు. దాంట్లో గూడా కొంచెం వియోగం.

మధురం ఆ ఉత్తరం తానే చింపి ముక్కలు ముక్కలుచేసి పుస్తకం రమణ గాడికి యిచ్చి "యీ తఢాకు తప్పించు కున్నావు. యిహ కబడ్దారీగా వుండు" అన్నది.

దాంతో మనవాడు బతుకు జీవుడా అని బయటపడ్డాడు. రూముకు వచ్చే

టప్పటికి సగం ప్రాణాలు చచ్చి వచ్చాడు. ఏమయిందిరా అంటే యెంత సేపటికీ చెప్పడు నేను వాణ్ణి బెదరించి జరిగిన కథ అంతా లాగాను తగిన శాస్తి అయింది కదా అని సంతోషించాను

ఈ కథ యింతటితో ముగిసింది కదా అనుకుంటే ముగియలేదు తలవని తలం పుగా కొత్తకొత్త డెవలప్మెంట్స్ వచ్చి నయి మొన్నటికల్లా

*　　*　　*

మొర్నాడు రాత్రి — అంటే నిన్న రాత్రి అన్నమాట — రమణగాడు యిదంతా యిట్లా వచ్చిం దనీ, యిట్లా చెయ్యబో తున్నా మనీ నాతో వచ్చి చెప్పిందాకా నా కేం తెలియదు, నమ్మండి

బి యస్ రావు, ఐ సి యస్ ఒకా యన వున్నాట్ట బహుశా మీకు తెలి యదు ఆ రావుగారికీ యీ రామనాధం గారికీ కొంత ముఖాముఖీనీ, కొంత పోస్టుద్వారానూ వుత్తర ప్రత్యుత్తరాలు జరిగినవి నిన్న పోస్టులో ఆ రావుగారి దగ్గరనుంచి ఓ వుత్తరం వచ్చింది, దాంట్లో "మీ మధురం నాకు నచ్చింది వివాహం చేసుకోటానికి వొప్పుకున్నాను 10 వ తారీఖున పెళ్ళి చేసుకోటానికి వస్తున్నా" అని రాశాడు

అంతవరకూ మధురానికీ, తల్లికీ యీ పెళ్ళి ముచ్చ ట్లేమీ తెలియవు రామనాధం గారు యేమీ ఖాయం గాంది యెందుకులే ముందస్తిగా చెప్పటం అని వూరు కున్నాడు. బి. యస్. రావుగారు రెండు వారాల కిందట పెద్ద హడావిడిగా వచ్చి రామనాధంగారి యింట్లో ఒకరోజు వుండి మధురాన్ని చూచి పోయినాడుగాని యింట్లోవాళ్ళకి యిందుకు వచ్చా డని ఏమీ తెలియదు

రామనాధంగారు యీ వుత్తరం చదువుకోగానే మధురమూ, తల్లీ భోంచే స్తూంటే వచ్చి అన్నాడు "యేమే, మన మధురానికి గొప్ప సంబంధం కుదిరింది రెండు వేల రూపాయల జీతగాడు — మన అమ్మాయిని చేసుకోడానికి వొప్పు కున్నాడు "

"అంటే మొన్న పదిరోజులనాడు మన యింటికి వచ్చిన ఆయనా యేం ?"

"అవును ఆయనే !"

"సరేలే — నల్లగా తుమ్మ మొద్దు లాగా — యాభై యేళ్ళున్నా వుండవూ ఆయ నకు ? ఇంతకూ మన మధురాన్ని కను క్కున్నారా ? ఈడు వచ్చిన పిల్ల పెద్ద చదువు చదువుకుంటూంది — మనంకూడా అందరి మోస్తరుగా చేస్తే నవ్వుతారు "

"నీవు ముందస్తిగానే దానికి నేర్పు దానికిమటుకు తెలియదా యేమిటి ? నెలకు రెండు వేలు వస్తూవుంటే యెవరన్నా వద్దం టారూ? — యేమే అమ్మ, నీ అభిప్రాయం ఏమిటి "

ఇంతవరకూ తల్లిదండ్రుల సంభాషణ తల వంచుకుని వింటున్నది మధురం అధాట్టుగా రామనాధంగారు యీ ప్రశ్న



జడ్జి – "నీవు దొంగతనం చేయలేదంటావే మరి ఆ ఇంట్లో ఎందుకు దూరావ్?"
దొంగ – "అది నా ఇల్లనుకున్నానండి "
జడ్జి – ''అయితే ఆ యింటి యజమానురాలును చూసి ఎందుకు పారిపోయ్యావ్?''
దొంగ – ఆమెను చూసి మా ఆవిడ అనుకున్నానండి?''

వేసేటప్పటికి తనకు జవాబు దొరకలేదు అసలు చిన్నప్పటినుంచి తండ్రి అంటే కొంచెం బెరుకు అందులో యిట్లాంటి విషయాలు తండ్రితో యెప్పుడూ మాట్లాడి యెరుగదు కనక మౌనమే అవలంబించింది ఆ మౌనాన్ని అంగీకారంగా తీసుకున్నాడు రామనాధంగారు

''ఆయన 10 వ తారీకు పెళ్ళి చేసుకోటానికి వస్తున్నాడు. కనక మనం సిద్ధంగా వుండాలి ఏముంది శివిల్ మారేజి చేసేద్దాము'' అన్నాడు

"సరేలే! అప్పుడే యిందాకా వచ్చిందీ? మొత్తంమీద మీదండీ నేర్పు ఇంటో నేను ఇంకా చావ్చాగదా. నాతో అన్నా చెప్పరాదూ? ఎవడిక్కావాలె. మీ యిష్టంవచ్చినట్టు చేసుకోండి తండ్రీ కూతుళ్ళు'' అంది

"నీ దొక యేడుపు ఇప్పటి సంగ

తులు ఏమీ తెలియవు పెద్దదాన పైనావు నీ కెందుకు వూరుకోవే అంటే వూరుకోవు వెధవగోల" అన్నాడు

''చాల్లేండి మీ మాటలు నేను ముసలి దాన్నయితే, యెవరినన్నా చిన్నదాన్ని పెళ్ళి చేసుకోండి. ఈడూజోడుగా వుంటారు"

"ఇహ చాలు నోరుమూసుకో"

*　　*　　*

సాయంత్రం నాలుగయింది టెన్నిసు ఆడుకుందాం గదా అని రమణా నేనూ కాలేజీ కెళ్ళాం

"ఏదో మీటింగల్లే వుంది ఒకసారి లోపలికి వెళ్ళొద్దామా యేం?" అన్నాడు రమణగాడు

"నా న్సెన్స్, ఏమిటి వెళ్లేది? టెన్నిసు ఆడుకుందాం లెద్దూ" అన్నా

"అట్లాకాదు, వూళ్ళో ఆడ జనం అంతా వచ్చారు ఒక్కసారి వెళ్ళి చూస్తే మర్యాదగా వుంటుంది" అన్నాడు వాడు

చేతుల్లో బాట్లు ఆడించుకుంటూ కాలేజీ హాలుకు దారి పట్టాం

దాంటో ఓ పెద్ద మీటింగు గొప్ప గొప్ప సంఘసంస్కర్తలం అనుకునేవాళ్ళందరూ చేరారు మొగవాళ్ళతో ఆడవాళ్ళతో కిటకిట లాడుతూంది హాలు మా యిద్దరికీ కష్టంమీద లోపల నిల్చోటానికి చోటు దొరికింది

రామనాధంగారు అప్పటికి అరగంట సేపటినుంచీ ప్రెసిడెన్షల్ ఎడ్రస్ యిస్తున్నారు.

"ఈ వివాహాలవల్ల కలిగే ఘోరాలు ఇంతకంటె ఇప్పుడు యెక్కువగా విశదీకరించటం అనవసర మని నేను గట్టిగా వూహిస్తాను

ఇటీవల జరిగిన సెన్సెస్ ప్రకారం యిండియాలో సంవత్సరానికి 4,250 000 బాల్యవివాహాలు జరుగుతూన్నయి అనీ అందులో 3,240 000 మంది బాలవితంతవులు అవుతున్నారనీ, అందులో 150,000 మందికి పునర్వివాహాలవుతున్నయి అనీ తేలింది చూచారా గుండె బద్దలయిపోతూంది

"అలాంటి వన్నీ రూపుమాపి యిండియాలోంచి పోవాలంటే, హిందూదేశంలో స్త్రీలకు పునర్వివాహం, విద్య, స్వేచ్ఛ—యివి ముఖ్యఅవుసరాలు స్వేచ్ఛ అనగా స్వతంత్ర బుద్ధి, అనగా స్వతంత్రశక్తి, అనగా free and independent thought "

ఇట్లా పోతూంది ధోరణి రామనాధం గారికి పోతూంటే ''యిహ చాల్లేరా! డబ్బాలాగా వుందిరా!" అన్నాడు రమణగాడు

కాని హాలంతా నిశ్శబ్దంగా వుంది, ఆయన్ను చూసి అయితేయేం, ఆయన లెక్చరు చూసి అయితేయేం రామనాధం గారంటే గొప్ప సంఘసంస్కర్త చిన్నప్పుడనంగా బ్రహ్మసమాజంలో చేరి

జంధ్యం, బొట్టూ తీసేశాడు కనక పెద్ద పే రు ప డ్డ బ్రహ్మసమాజికు డాయెను (అసలు కాలేజీలో వు ద్యో గ ం కూ డా సమాజంవల్లనే అని అందరికీ తెలిసిన రహస్యమేనాయెను) పైగా యీ మీటిం గుకు ప్రెసిడెంటుకూడా ఆయను—అంతా నిశ్శబ్దంగా వింటున్నా రంటే ఆశ్చర్యం లేదు

అంతవాడిని పట్టుకుని యీ రమణ గాడు.డబ్బాలాగా వుంది అంటే మొత్తం మీద కొంచెం జాలివేసింది అప్పు డన్నాను "యిప్పుడు డబ్బాలాగా వుందని అంటున్నావుగాని మొదట నేను వద్దురా అంటే విన్నావు ? అసలు నీవు యెందు కొచ్చావో తెలుసులే, చివాట్లుతిన్నా సిగ్గు రాలేదు నీకు మధురం వచ్చిందేమో చూతా మని వచ్చావు ఆమె రాలేదు, యిహ పోదాం పద అంటున్నావు."

మధురంకోసం వచ్చా నంటే నేను వొప్పుకోను గాని ఆమె రాకపోవటం కొంత వింతగానే వుంది'' అన్నాడు రమణ

ఇంతలో దిక్కులు చూస్తున్న ఓ పెద్దమనిషి మావంక చూచి "సైలెన్స్ ప్లీజ్'' అని కేకేశాడు

ఇక్కణ్ణించి ఇహ వెళ్ళితేనే మర్యాద దక్కుతుం దన్నా, ఇద్దరం బయట పడ్డా నికి చూస్తూంటే ఇంతట్లోకే రామనాధం గారు రమణరావును చూచి, రమ్మని సంజ్ఞచేసి, కాగితాలేవో బల్లమీదపెట్టాను,



అవి అవుసరంగా కావాలి' అన్నాడు. రమణగాడు ఏమనుకున్నాడో సంకో చించకుండా బైలుదేరాడు.

* * *

రమణగాడు అట్లా బయలుదేరి వెళ్లి రామనాధంగారి యింట్లో మ ధు రా న్ని వొంటరిగా కలుసుకున్నాట్ట

ఇహ యిక్కడి నుంచీ మీకు డిటేల్సు సప్లయి చేయలేను నాకు రమణగాడు చెప్పింది కొంత, నేను వూహించింది కొంత

రమణగాడు బల్లమీది కాగితాలు తీసు కుంటుంటే మధురమే మొదలు పెట్టి వుంటుంది

"విన్నావా ?"

"ఎమిటి ?"

"వచ్చే 10 వ తారీఖు నాకు..

"ఏమిటి ?"

"మారేజి "

"ఏ మి టీ ? ——ఏ మి టీ ? —— మారేజా ? ——ఎవరికి ?"

"నాకే "

"ఎవరు ?"

"ఏమి ఎవరు ?——పెళ్ళికొడుకా ?— ఎవరో బి యస్ రావుట "

"ఆఁ ?" నోరు కొం చెం సే పు అట్లాగే తెరుచుకొని వుంది రమణగాడికి

"ఏమిటీ ఆశ్చర్యం ? నీకిష్టంలేదా యేమిటి ?'

"నీ కిష్టమే ?"

"ఎందుకు ? కాకపోతే యీ పెళ్ళి మంచి నన్ను తప్పిస్తావా ?"

"తప్పించమంటే తప్పిస్తాను ''

"ఎట్లా ?

''ముందు నేనే పె ళ్ళి చేసుకుంటాను

' లేకపోతే ''

"నన్ను పెళ్ళి చేసుకోక పోయినా తప్పిస్తాను నీ ఇష్టం '

"నాకు యెట్లాగైనా యిష్టమే నీ యిష్టం యెట్లాగో అట్లాగే చెయ్యి "

అప్పుడు మధురాన్ని కనీసం రెండు ముద్దులయినా పెట్టుకొని వుంటాడు అవకాశం దొరికితే వొదిలిపెట్టే రకం కాదు మన రమణగాడు

అప్పటికి ఆపి కాగితాలు తీసికొని పరెగెత్తుకెళ్ళి రామనాధంగారి కిచ్చి మళ్ళీ పరుగెత్తుకొని వచ్చి మధురాన్ని కలుసుకున్నాట్ట అప్పుడు యేమి జరిగిందో నేను బొత్తిగా యేమీ చెప్పలేను

రెండుగంటల రైలుకు బండి తీసుకొచ్చి రూము దగ్గర నిలబెడితే మధురం వచ్చి కలుసుకునేటట్టు యేర్పాట్ల ప్రకారం అంతా సక్రమంగా జరిగిం దని నేను వేరే చెప్పక్కర్లేదు

* * *

తెల్లవారింది మమ్మల్నిద్దరినీరమ్మని ఖబురు పంపిస్తే నేను వెళ్ళాను రామనాధంగా రింటికి రా మ నా ధ ం గా రి ముఖంలో ప్రమాదకరమైన కాంతి కనిపిస్తోంది రామనాధంగారి భార్య కంటిలో తడి కనిపిస్తోంది యెవరో రామనాధంగారి స్నేహితుడు గామాలును యింకో ఆయన వున్నాడు వుండాలిసిన అదుర్దా అంతా ఆయన ము ఖ ం లో వుంది మొత్తంమీద లోపల ప్రవేశించి నప్పటినుంచీ ఆ యింటిలో గాలి సులభంగా పీల్చుకోలేకపోయినాను

' రమణరావు యేడి ?' అని అడిగాడు రామనాధంగారు

"నిన్న సాయంత్రనుంచీ నాకు కనిపించలేదు "

"ఎక్కడికి వెళ్లాడు ?'

' ఏమో నాతో చెప్పి వెళ్ళలేదు '

ఆ రెండో ఆ య న అన్నాడు — "నిన్ను కాలేజిలోంచి డిస్మిస్ చేస్తారు నిజం చెప్పకపోయినావంటే "

"ప్రమాణం చేసి చెపుతున్నాను. నిన్న సాయత్రం నుంచీ కనిపించ లేదండి" అన్నా

"రామనాధంగారూ! ఇహ యెందుకూ? ఇది ఆ రమణరావు పనే అయితే అతను మీ యింటికి రావటం అలవాటు వుందా యేం?"

'ఎప్పుడన్నా వస్తూవుండేవాడే ఇందుకోసం వస్తున్నాడని నాకేం తెలుసు? నిన్న సాయంత్రం కూడా కాయితాలు తీసుకురమ్మని యింటికి పంపాను దాంతో వచ్చింది యీ ప్రమాదం ''

అసలు ప్రమాదం అదికాదు నేనంటే మీకు కోపం వస్తుందేమో కాని యెన్నేళ్ళొచ్చినా పెళ్ళి చెయ్యకపోవడం మొగపిల్లలతో పాటు చదివించడం— ఏమయినా చెప్పండి చిన్నప్పుడే పెళ్ళి చెయ్యడం మంచిది '

అప్పుడు రామనాధంగారి భార్య అందుకుంది—— అసలు తప్పు దాంది కాదు తప్పంతా రామనాధం గారిదే ఎవ్వరితో చెప్పకుండా ఆ ముసలి సంబంధం తీసుకొచ్చారు దాంతో హడలేసి పరుగెత్తింది "

"పరే, యిదికూడా ఒకటి చేశారూ? ఇహ మీ బ్రహ్మసమాజ మేమిటి? మీ సంఘ సంస్కరణ మేమిటి? అన్నాడు స్నేహితుడు

రామనాధంగారికి మొహాన నెత్తురు చుక్క లేదు చిన్నబుచ్చుకున్నాడు అప్పుడు ఆ స్నేహితు డన్నాడు — 'నేనొక సలహా చెపుతాను అట్లా చెయ్యండి మీ అమ్మాయికి ఎన్నోఏడు?"

"పంధొమ్మిదో యేడు "

అయితే కిడ్నాపింగు క్రింద పదికి రాదుగాని యెబ్డక్షన్ క్రింద ఆ రమణరావు మీద కేసు పెట్టు!"

మీ సలహా బాగాలేదు లోకానికంతా యిట్లా జరిగిం దని తెలియబరుచుకొని తలకాయ యెత్తుకోకుండా చేసుకోడానికి చెబుతున్నారు ఇప్పుడే నేను బయలు దేరి వెళ్ళి వాళ్ళిద్దరినీ కొంపకు తీసుకొస్తాను ఇహ మీరందరూ దయచెయ్యండి" అన్నాడు రామనాధంగారు

అప్పుడు మే మందరం వచ్చేశాం. నామటుకు నేను రామనాధంగారి ప్రతిష్ఠ, మనకం ప్రతిష్ఠ ముఖ్యంగా రమణగాడి ప్రతిష్ఠ కాపాడటాని కని యెవరికీ చెప్ప దలచుకోలేదు ఇంతలోనే ఊరంతా యెట్లా తెలిసిందో నాకు బోధపడకుండా వుంది అని వెంకట్రావు తన కధ ముగించాడు